క్లుప్తంగా

'సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం'



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రోజారమణి

బెజ్జూర్: సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీపీ జోకే రోజా రమణి అన్నారు. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన కుశన శ్రీకాంత్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధికి దరఖాస్తు పెట్టుకోగా సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో మంజూరైన రూ.56వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. డోకే వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామంలో ఈ నెల 12 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సతీష్, శ్రీకాంత్, ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.21 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11 వేలు అందిస్తామన్నారు. వివరాలకు 9392352960, 9347547828 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వాంకిడి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వాంకిడి సర్పంచ్ బండె తుకారాం, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, నాయకులు అశోక్ మహోల్కర్, తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నిగా

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ పంచాయతీ పరిధిలో గల సడక్‌గూడ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన మట్టి రోడ్డును శుక్రవారం సర్పంచ్ అన్నిగా ప్రారంభించారు. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఉపయోగకరంగా ఉంటుందని మట్టిరోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఏ రాథోడ్ ప్రేమ్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : పులి
కాగజ్‌నగర్
వెంకటరమణ : పులి
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	50
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

'పంట మార్పిడి'తో ప్రయోజనం

- కొత్త పంటలు వేయాలని అధికారుల సూచన
- ఏళ్లుగా ఒకే పంట సాగుతో తెగుళ్ల బెడద
- ఎరువుల వినియోగంతో పెరుగుతున్న పెట్టుబడి



బాబాపూర్ సమీపంలో సాగు చేసిన మొక్కజొన్న

చింతలమానెపల్లి: మండలంలో అనేక మంది రైతులు ప్రతీ ఏడాది ఒకే పంటను సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారు. పంటకు తెగుళ్ల బెడద పెరగడంతో పాటు పెట్టుబడి వ్యయం కూడా విపరీతంగా పెరుగుతోంది. దీంతో పంట మార్పిడి విధానంలో పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. పలువురు రైతులు పంట మార్పిడిలో భాగంగా నూనె గింజలు, మొక్కజొన్న, శనగ, పెసర, కూరగాయలు వంటి పంటలు పండిస్తున్నారు.

తెగులు.. గుబులు

మండలంలోని రైతులు ప్రతీ ఏడాది ఎక్కువగా మిరప పంట సాగు చేస్తుంటారు. ఈఏడాది సైతం అనేక మంది రైతులు మిరప పంట వేయగా ఎండు తెగులు సోకి తీవ్రంగా నష్టపోయారు. మండల కేంద్రంలో ఫైజోరియా అనే తెగులు సోకి మిరప ఎండిపోవడంతో ఆర్థిక నష్టాలు వచ్చాయి. ప్రతీ ఏటా పండించే పత్తి పంటలో సైతం దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల ఎరువులు వినియోగించినా దిగుబడులు పెరగడం లేదని వాపోతున్నారు. ఒకే తరహా పంటలను ప్రతీ ఏడాది సాగు చేస్తే దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఒకే పంటను పండించడం ద్వారా నేలలోని పోషకాలు తగ్గి భూసారం తగ్గడంతో పాటు వివిధ రకాల తెగుళ్లు పంటలకు సోకుతాయని అధికారులు పేర్కొంటున్నారు. తెగుళ్ల నివారణకు పురుగుల మందులు, రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగించడం ద్వారా వ్యయం సైతం పెరిగి రైతులు నష్టపోతున్నారు.

పంట మారిస్తేనే..

పంట మార్పిడి చేసి సాగు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుంది. పంట మార్పిడి ద్వారా నేలలోని సారం పెరిగి తెగుళ్లు తగ్గుతాయి. ఒక పంటకు అవసరమైన పోషకాలను పంట మార్పిడిలో సాగు చేసే మరో పంట అందిస్తుంది. నేలలో పోషకాలను సక్రమంగా వినియోగించడం ద్వారా రైతులకు ఖర్చు కూడా తగ్గుతుంది. రైతులు నష్టాలను కలిగించే ఒకే తరహా పంటను సాగు చేయడం మానుకోవాలని, పంట మార్పిడి వైపు ఆలోచించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

లాభాల వైపు అడుగులు?

ఈఏడాది ఆరంభంలో రైతులు పత్తి విత్తనాలు నాటగా వర్షాభావ పరిస్థితుల కారణంగా విత్తనాలు ఎండిపోయాయి. దీంతో పలువురు రైతులు కొత్త తరహా పంటల వైపు అడుగులు వేశారు. మండలంలోని కొందరు రైతులు నూనె గింజల పంటలు సాగు చేశారు. పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ, పెసర తదితర పంటలను సైతం పండిస్తున్నారు. రవీంద్రనగర్ పరిధిలో బెంగాలీలు కూరగాయలు సాగు చేస్తున్నారు. మొదటి విడతలో పత్తి, వరి పంటలను సాగు చేసి పంట కోతల అనంతరం కూరగాయల సాగు చేస్తున్నారు. చేతి కందిన దశలో సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే లాభాలు సాధిస్తామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పంటమార్పిడి చేసే రైతులు తమను సంప్రదిస్తే భూసార పరీక్షలు చేసి తగిన సూచనలు అందజేస్తామని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

సావిత్రీబాయి ఆశయ సాధనకు కృషి చేయాలి



ఆసిఫాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బెజ్జూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



దహెగాంలో..



కౌటాల: పూలమాలలు వేస్తున్న నాయకులు



కెరమెరి: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కౌటాల: సావిత్రీబాయి పూలే ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ అన్నారు. మాలీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతి వేడుకలను మండల మాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. మండలంలోని ముత్తంపేట్, కన్నెపల్లి, నాగేపల్లి గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. సంఘం మండలాధ్యక్షుడు నికోడే గంగారాం, సంఘం నాయకులు రాము, ఆదే చందు, పాండురంగ్, తిరుపతి, అధ్యాపకులు రాము, రాందాస్, రవీందర్, రజిత పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామంలో శుక్రవారంసావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను మాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మాలి సంఘం నాయకులు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మోర్లె నాగేష్, సర్పంచ్ వసకే మురారి, నాయకులు భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను తోటమాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు అశోక్, యూత్ నాయకులు సురేష్, గోపాల్, భీంరావు, మహేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంతో పాటు నీంగూడ, తదితర గ్రామాల్లో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం మండల కమిటీ అధ్యక్షుడు కావ్డే తుల్సీరాం, నాయకులు సెండే నారాయణ, వాడై సుభాష్, సుధాకర్, దేవెందర్, తిరుపతి, గణపతి, ఒసామా, ముకుంద్‌రావు తదితరులు ఉన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌రూరల్: చదువుల తల్లి సావిత్రీబాయి పూలే ఆశయాలను ప్రతీ విద్యార్థి కొనసాగించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యారంగ సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం కన్వీనర్ ప్రణయ్, మండల అధ్యక్షుడు సాయికృష్ణ, కిరణ్, అధ్యాపకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువైద్యశాలపై పట్టింపేది..?

- ఏళ్లు గడుస్తున్నా తీరని సిబ్బంది కొరత
- వైద్యసేవలు కరువు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన భవనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



నిరుపయోగంగా నంబాల పశువైద్యశాల భవనం

రెబ్బెన: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నంబాల పశువైద్యశాల నిరుపయోగంగా మారింది. ఆసుపత్రిలో ఉండాల్సిన కనీస సిబ్బంది కూడా లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

పశువైద్యశాలగా అప్‌గ్రేడ్..

మండల కేంద్రంలో ఒక పశువైద్యశాల ఉండగా నవేగాం, నంబాల గ్రామాల్లో గ్రామీణ పశువైద్యశాలలు ఉండేవి. కాలక్రమేణ పశువుల సంఖ్య పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వం 2012లో నంబాలలో ఉన్న గ్రామీణ పశువైద్యశాలను పశువైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసింది. ఆసుపత్రి భవనం కోసం ప్రభుత్వం 2015లో సుమారు రూ.16 లక్షలు విడుదల చేయగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి 2016లో ప్రారంభించారు. కాని ఇప్పటి వరకు ఆసుపత్రిలో అవసరమైన సిబ్బందిని నియమించడంలో అధికారులు విఫలయ్యారు. అప్‌గ్రేడ్ అయినప్పటి నుంచి కనీసం ఆసుపత్రికి రెగ్యులర్ పశువైద్యాధికారి లేరంటే అతిశయోక్తి కాదు. ఆసుపత్రిలో ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, ఆఫీస్ సబార్డినేట్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మాత్రమే పని చేస్తున్నారు. ఇక మిగిలిన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

ఆసుపత్రిలో అవసరమైన సిబ్బంది లేకపోవడం, ఏళ్లు గడుస్తున్న ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తుండటంతో ఆసుపత్రిలో వైద్యసేవలకు మోక్షం కలగడం లేదు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే పశువుల యజమానులు పశువులను రెబ్బెన పశువైద్యశాలకు తీసుకెళ్తున్నారు. దీంతో సకాలంలో వైద్య సేవలు అందక పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆసుపత్రి నిర్వహణ చేపట్టేవారు లేక లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. దీంతో భవనం అసాంఘిక కార్యక్రమాలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం ఆసుపత్రి ఆవరణలో మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నంబాల పశువైద్యశాలలో సిబ్బంది కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆసుపత్రిలో ప్రస్తుతం జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఫీల్డ్ వర్క్ ఉండటంతో ఆసుపత్రిని తెరవడం లేదు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆసుపత్రి నిర్వహణ చేపట్టేవారు లేరు.

- రామకృష్ణ, ఇన్‌చార్జి పశువైద్యాధికారి

బెల్లంపల్లి ఏరియాలో కార్మికులను నియమించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో కార్మికుల కొరత సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ కార్మికులను నియమించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియా వర్క్‌షాప్‌తో పాటు ఖైరిగూడ ఓసీపీలలో కార్మికుల కొరత తీవ్రంగా ఉందన్నారు. కార్మికుల కొరత నివారించేందుకు 200 మంది కార్మికులను ఏరియాలో నియమించాలన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవితపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. సమావేశంలో చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, సమ్మయ్య, రవీందర్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు రాజేశం, కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

నర్సరీ తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీని తొలగించాలని కోరుతూ శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంఈవో సోమయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నర్సరీ ఉండటంతో పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో ఉన్న నర్సరీని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో భూపాలపట్నం గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను పరిశుభ్రంగా ఉంచాలి



సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: శ్మశాన వాటికను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కెలిబి గ్రామ పంచాయతీల్లోని సెగ్రిగేషన్ షెడ్లు, పల్లెప్రకృతివనాలు, నర్సరీలను ఎంపీవో సదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. సర్పంచ్ ఆదే నారాయణ తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి: చూపు సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దృష్టి సమస్య ఉన్న ప్రతీ ఒక్కరికి ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టు, పంచాయతీ కార్యదర్శి సురేష్,వైద్య సిబ్బంది ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన



మాట్లాడుతున్న వెంకటేశ్

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ ఆడ వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గర్భిణీలు, బాలింతల్లో ఇప్పటికే రక్తహీనత అధికంగా ఉందన్నారు. రక్తహీనత నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. రక్తహీనత కలగకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్, సూపర్‌వైజర్ లక్ష్మీకాంత, తదితరులు ఉన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: 108 ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం మేనేజర్ స్మామాట్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు 108 సిబ్బంది సకాలంలో స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. 108 వాహనాల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సమావేశంలో ఎఫ్‌సీ జనార్ధన్, ఈఎంఈ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చారిగాం మండల పరిషత్ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సావిత్రీబాయి వర్ధంతి సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవో భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్, ఎంపీటీసీ తారాబాయి, సర్పంచ్ స్వాతి, ఉపసర్పంచ్ తిరుపతి, పాఠశాల కమిటీ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు రమేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దాలి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని గ్రామాలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. లింగాపూర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు.